



Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 41 | గురువారం 3 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## హిమాచల్‌లో జల విలయం..
# 51 మంది మృతి...


- రెడ్ అలర్ట్ జారీ!
- హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలు
- జూన్ 20 నుంచి ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన 51 మంది
- వరద సంబంధిత ఘటనల్లో మరో 22 మంది గల్లంతు
- ఉగ్రరూపం దాల్చిన బియాస్ నది, పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- మండీ జిల్లాలోనే అత్యధికంగా 10 మంది మృతి



**సిమ్లా - సూర్యవాస్తవం, జూలై 2:**

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో అతలాకుతలమవుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వానలకు జనజీవనం స్తంభించిపోయింది. ప్రకృతి సృష్టిస్తున్న ఈ బీభత్సానికి ఇప్పటివరకు 51 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారులు అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఈ విపత్తుపై ఒక నివేదికను విడుదల చేసింది. జూన్ 20 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగిన నష్టాన్ని ఈ

- మిగతా 2లో..



## బ్రిక్స్ పట్ల భారత్ నిబద్ధత !

- పేద దేశాల ప్రాధాన్యతలపై చర్చ
- ఐదు దేశాల పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం, జూలై 2:**

పేద దేశాల (గ్లోబల్ సౌత్) ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళేందుకు గల మార్గాలపై రాబోయే రోజుల్లో భారత్, బ్రెజిల్ చర్చిస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం చెప్పారు. ఈ నెల 2 నుండి 9 వరకు ఐదు దేశాల్లో దౌత్యపర్యటనకు బయల్దేరుతున్న సందర్భంగా ప్రధాని ఒక ప్రకటన జారీ చేశారు. రియో డీ జెనీరోలో జరగబోయే బ్రిక్స్ సదస్సు 'సమతుల్యమైన బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడానికి దోహదపడుతుందని అన్నారు. వారం రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని ఘనా, ట్రినిడాడ్,టబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటించనున్నారు. గ్లోబల్ సౌత్ పరిధిలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందన్నారు. వ్యవస్థాపక దేశంగా బ్రిక్స్ పట్ల భారత్

- మిగతా 2లో..

## మెడికల్ విద్యార్థులను ఎందుకు వేధిస్తున్నారు?

- వైసీపీ అధినేత జగన్

**అమరావతి - సూర్యవాస్తవం, జూలై 2:**



విదేశాల్లో విద్యను అభ్యసించి ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణులైనా వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం ఫార్మాలిటీ అయినా వేధిస్తున్నారని, ఇదేనా పరిపాలన అని విమర్శించారు. తప్పులను ఎత్తిచూపితే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, వారిపై వివక్ష చూపుతూ ఇంటర్న్‌షిప్ పేరుతో దీర్ఘకాలం చాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలకు లాభం కలిగిచేందుకే వీరికి రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం లేదని, తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు విదేశాల్లో చదివిస్తే వారిని అంటరానివారిగా చూస్తున్నారని ఆగ్రహించారు. అవినీతి కోసం స్కాములు చేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా అడ్డుకున్నారని

- మిగతా 2లో..

## విధ్వంసం నుంచి
# వికాసం వైపు



- కుప్పం అభివృద్ధి నభూతోన భవిష్యత్తులా ఉంటుంది
- కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన



**కుప్పం - సూర్యవాస్తవం, జూలై 2:**

కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మంగళవారం బెంగళూరు నుంచి కుప్పం చేరుకున్నారు.ఈ సందర్భంగా సీఎంకు జిల్లా,కుప్పం నియోజకవర్గ నేతలు, కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కుప్పంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు శాంతిపురం మండలం తుంశి వద్ద ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.మొత్తం రూ.1292.74 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, సంక్షేమ, ప్రత్యేక పథకాలను సీఎం ప్రారంభించారు. వీటిలో ఇప్పటికే

- మిగతా 2లో..



## ప్రభుత్వ విద్య బలోపేతం ఉపాధ్యాయుల బాధ్యత

- మంత్రి నారా లోకేష్

**అమరావతి - సూర్యవాస్తవం, జూలై 2:**

ప్రభుత్వ విద్య బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులపై బాధ్యత ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో గిరిజన గ్రామం జెఎం తండాలో ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం కళ్యాణి కుమారిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పనిచేస్తున్న పాఠశాలలో కళ్యాణి అంకిత భావంతో పనిచేసి పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్
# నిర్మాణం పూర్తి..

- రైతులకు అండగా నిలుస్తాం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్

**అమరావతి - సూర్యవాస్తవం, జూలై 2:**

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చుని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు

- మిగతా 2లో..



# హిమాచల్‌లో జల విలయం..
# 51 మంది మృతి...



(మొదటిపేజీ తరువాయి)
నివేదికలో పొందుపరిచింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్ష సంబంధిత ప్రమాదాల కారణంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఈ మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ ఘటనల్లో సుమారు 103 మంది గాయపడినట్లు నివేదిక వెల్లడించింది. అత్యధికంగా మండీ జిల్లాలో 10 మంది చనిపోయారని తెలిపింది. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండీ జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చండీగఢ్-మనాలీ జాతీయ రహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ముందుజాగ్రత్త చర్యగా మండీ, సిర్మౌర్ జిల్లాల్లో సుమారు 250కి పైగా రహదారులను అధికారులు మూసివేశారు. పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వరదల కారణంగా 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 మంచినీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్, నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి.

# మెడికల్ విద్యార్థులను
# ఎందుకు వేధిస్తున్నారు?

(మొదటిపేజీ తరువాయి)
వివరించారు. పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసి కేటాయించిన సీట్లను కూడా వద్దని ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులపై ఇంత పగ ఎందుకో చెప్పాలన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని, ఎన్ఎంసి గైడ్‌లైన్స్ ప్రకారం ఎఫ్ఎంజి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వెంటనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ విద్య బలోపేతం
# ఉపాధ్యాయుల బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)
ఉపాధ్యాయు లందరికీ ఆమె ఆదర్శంగా నిలిచారని తెలిపారు. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిసారిస్తామని తెలిపారు. ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఆమె నుంచి లోకేష్ సలహాలు, సూచనలు స్వీకరించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రికి ఆమె చెప్పారు. 2017లో జెఎం తండా మండల పరిషత్ ఏకోపాధ్యాయ పాఠశాలకు కళ్యాణి బదిలీ అయ్యారు. ఆ సమయంలో విద్యార్థులు 14 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులుగా ఆమె సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. 2020-21లో విద్యార్థుల సంఖ్య 52కు పెంచారు. ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన వారిలో 23 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందగా, ఒకరికి నవోదయ పాఠశాలలో ప్రవేశం లభించింది.

# ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి..

(మొదటిపేజీ తరువాయి)
సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.

# జగన్ భద్రతపై విచారణ

**అమరావతి -సూర్య వాస్తవం, జూలై 2:**
మాజీ సిఎం వైఎస్ జగన్‌కు జడ్‌ప్లస్ భద్రత ఉందని, ఇలాంటి ప్రముఖ వ్యక్తులకు రక్షణ కల్పించడంలో రాష్ట్రం విఫలమవుతుందంటూ వైసిపి నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనకు ఈ నెల 3వ తేదీ (గురువారం) పర్యటనకు వస్తున్న సందర్భంగా తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని వైసిపి నేతలు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ ఎస్ హరినాథ్ బుధవారం విచారించారు. దీనిపై హైకోర్టు, వైఎస్ జగన్‌కు కల్పించనున్న భద్రతకు

# విధ్వంసం నుంచి
# వికాసం వైపు





(మొదటిపేజీ తరువాయి)
రూ.125.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. రూ.47 కోట్లతో30 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పూర్తి చేశారు.రూ. 42.5 కోట్ల వ్యయంతో 46 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, 65 కిలోమీటర్ల బీటీ రోడ్లు పూర్తి చేశారు.తాగునీటి సరఫరా నిమిత్తం రూ.8.97 కోట్లతో పనులు పూర్తి చేశారు.గోకులం షెడ్లకు రూ.7.63, వీధిదీపాలకు రూ.3.7 కోట్లు, రూ.1.64 కోట్లతో పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు.1000 మంది మహిళా లబ్దిదారులకు కొత్తగా గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.3041 మంది లబ్దిదారులకు కొత్తగా పెన్షన్లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించారు.7,488 ఎస్సీ ఎస్టీ గృహాలకు రూ. 21.80 కోట్ల వ్యయంతో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు.

వచ్చే ఏడాది జనవరి నాటికల్లా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సిఎం తెలిపారు.కుప్పం నియోజకవర్గంలో చెత్త సేకరణకు 130 ఎలక్ట్రిక్ ఆటోలను ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించారు.

ఇంటింటి చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగిస్తున్న తొలి నియోజకవర్గంగా కుప్పం అవతరించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు.కామన్ ట్రీట్ మెంట్ సెంటర్ లో చెత్తను రీసైకిల్ చేయటం ద్వారా జీరో ల్యాండ్ ఫిల్ పాలసీ అమలు చేస్తున్న నియోజకవర్గంగా కుప్పం మారనుందని ఆయన పేర్కొన్నారు. పేటీఎం సంస్థ సీఎస్ఆర్ నిధులతో అడ్వాన్సు లైఫ్ సపోర్టు అంబులెన్సులు ప్రారంభించిన సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు.400 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేర్ అండ్ గ్రో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.పీఎం కుసుమ్ పథకం కింద రూ.564 కోట్లతో వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్ అందేలా కార్యాచరణ దీని ద్వారా 32,106 వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందనుందని తెలిపారు.కుప్పంలో టూరిజం అభివృద్ధికి తోడ్పడనున్న లీ కంఫర్ట్ 3 స్టార్ రిసార్టును ప్రారంభించిన సీఎం 1387 మంది దివ్యాంగులకు ఉపకరణాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారు. 400 మంది డ్వాక్రా మహిళలకు ఇ- సైకిళ్లు సీఎం చేతుల మీదుగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్,నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# నిఘా నీడలో రాష్ట్రం

**- హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత**

**తుని -సూర్య వాస్తవం, జూలై 2:**
రాష్ట్రంలో లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే కార్యాచరణలో వడివడిగా అడుగులు పడుతున్నాయని, నిఘా నీడలోకి రాష్ట్రాన్ని తీసుకువస్తున్నట్లు రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారంనాడు తుని పట్టణంలో సబ్ జైలు ఆవరణంలో 600 గజాల్లో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకు,సబ్ జైల్ ను ప్రభుత్వ విప్పు తుని ఎమ్మెల్యే యనమల దివ్య తో కలిపి పునప్రారంభించారు.

సందర్భంగా విలేకరులతో వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో, గ్రామాల్లోనూ సీసీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే 60 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన పనులు మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు. రాష్ట్రం లో లా అండ్ ఆర్డర్ కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధునాతన టెక్నాలజీని అనుసంధానం చేస్తున్నామని, పోలీసు శాఖకు ఏఐ టెక్నాలజీని అడాప్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా,మాదక ద్రవ్యాల వాడకాన్ని పసిగట్టేందుకు డ్రోన్లతో పర్యవేక్షణ చేస్తున్నామని, తప్పు చెయ్యాలని ఆలోచన నేరస్థులకు రాకుండా ఉండే విధంగా,తప్పు చేస్తే దొరికిపోతామనే భయం కలిగేలా రాష్ట్ర వ్యాప్తంగా సర్వెలెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు.



జైళ్లలో భద్రత పెంచుతున్నామని, కొన్ని జైళ్లలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. జైల్లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు పెట్రోల్ బంకుల్లోనూ,మాల్స్ లోను,టిఫిన్ సెంటర్లను నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వానికి అనుబంధంగా పనిచేసే అధికారులు ఎటువంటి ఇబ్బందులు పడరని కానీ రూల్ ఆఫ్ లా ను అతిక్రమించి రాజకీయ నాయకుల ప్రాపకం కోసం పనిచేసిన కొద్ది మంది అధికా రులు ఇబ్బందులు పడుతున్నారని ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీపీ అంజన్ కుమార్, జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు, పెద్దాపురం డీఎస్పీ శ్రీ హరిరాజు, పట్టణ సీఐ గీతా రామ కృష్ణ, రూరల్ సీఐ చెన్న కేశవరావు,ఎస్సైలు టి.రామ కృష్ణ, విజయ్ బాబు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఆర్థిక గతిని మార్చేసిన జీఎస్టీ

వస్తు, సేవల పన్ను భారత దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు. ఎనిమిదేళ్ల తరువాత 2025లో జీఎస్టీ విధానం దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకతను పెంచడం, వృద్ధిని పెంపొందించేందుకు విలువ ఆధారిత పన్నులు(వ్యాట్) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పటి నుంచి నేటి వరకు జీఎస్టీ సాధించిన కొన్ని విజయాల గురించి తెలుసుకుందాం. ఒకే దేశం, ఒకే పన్ను. జీఎస్టీ అమలు ద్వారా 17 వేర్వేరు పన్నులు, 13 సెస్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. దాంతో గతంలో రాష్ట్రాల్లో ఉన్న పరోక్ష పన్నుల భారం తొలగిపోయింది. ఈ సమన్వయం ఒక ఉమ్మడి జాతీయ విధానాన్ని సృష్టించింది. లాజిస్టిక్స్ ఖర్చులను గణనీయంగా తగ్గించింది. రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేసింది. ప్రతి సంవత్సరం జులై మొదటి తేదీని వస్తు సేవల పన్ను దినోత్సవంగా దేశంలో పాటిస్తున్నారు. ఇది కేవలం ఒక పన్ను విధానం ఆవిర్భావ దినోత్సవం మాత్రమే కాదు, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఓ సుస్థిర మార్గాన్ని ఏర్పరిచిన ఘట్టం. దేశవ్యాప్తంగా పన్నుల పరంగా అనేక మోడళ్ల మధ్య జరుగుతున్న గందరగోళానికి ముగింపు పలికిన మలుపు. వస్తు సేవల పన్ను అమలుకు దారితీసిన అవసరాలు ఎన్నో. కొంతకాలం క్రితమే మన దేశంలో విక్రయపు పన్ను, ఎక్సైజ్ సుంకం, సేవలపై పన్ను, రాష్ట్రాల మధ్య వ్యాపార లావాదేవీలపై వేర్వేరు పన్నులు, ప్రవేశపు పన్ను వంటి అనేక రకాల పన్నులు అమలులో ఉండేవి. రాష్ట్రానికి ఒక విధానం, మరో రాష్ట్రానికి మరో విధానంతో వ్యాపార రంగం సంక్లిష్టతలతో కొట్టుమిట్టాడేది. దేశ వ్యాప్తంగా సమగ్ర వ్యాపార వాతావరణం ఏర్పడలేకపోయింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఒకే విధమైన పన్ను విధానాన్ని రూపొందించారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చింది. దీనివల్ల పన్నుల వ్యవస్థసరళతరం అయింది. వ్యాపారులు పన్నుల వివరాలు సమర్పించడంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటం ప్రారంభించారు. ఈ పన్ను విధానం మూడు భాగాలుగా విభజించబడింది. తయారీదారునుండి తుది వినియోగదారుని వరకు ప్రతి దశలో విధించబడే పన్నును తక్షణమే ముందుగానే చెల్లించిన పన్నుతో సమన్వయం చేసుకునే అవకాశం కల్పించబడింది. దాని వల్ల ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను విధించే పరిస్థితి లేకుండాపోయింది. ఈ విధానంలో కేంద్రానికి ఒక భాగం, రాష్ట్రానికి మరో భాగం లభించేలా పన్ను వసూలు జరుగుతుంది.అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలపై ప్రత్యేకంగా మరో విధానంలో వసూలు జరుగుతుంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య వస్తువుల రవాణా సులభతరమైంది. వాణిజ్యానికి ఆటంకాలు తొలగిపోయాయి. ప్రస్తుతం ఈ పన్ను విధానం నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించ బడింది. అవసరమైన నిత్యావసర వస్తువులకు తక్కువ శాతం, విలాస వస్తువులకు ఎక్కువ శాతం విధించబడుతున్నాయి. దీనివల్ల సామాన్యులపై భారం తగ్గించబడి, విలాస వస్తువుల వినియోగంపై నియంత్రణ సాధించబడుతోంది. ఈ పన్ను విధానం ప్రారంభం తరువాత ప్రభుత్వ ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయి. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో పన్ను ద్వారా వచ్చిన ఆదాయం 22.08 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉండటం గమనించదగినది.ఇది పాలనా సామర్థ్యాన్ని సూచించడమే కాదు, పన్ను చెల్లింపులో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, దీనిలో కొన్ని సవాళ్లు ఇప్పటికీ ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఈ పద్ధతిలో పూర్తిగా స్థిరపడలేకపోతున్నారు. పన్ను వేదికపై సాంకేతిక సమస్యలు, ఖాతాల సర్దుబాటు లోపాలు, ఎంటరైన పన్ను మొత్తాన్ని తిరిగి వాడుకునే అవకాశాలపై చిక్కులు, తరచూ మారే నిబంధనలు వీటన్నీ వ్యవస్థపై కొంత అస్పష్టత కలిగిస్తున్నాయి. వస్తు సేవల పన్ను దినోత్సవం అనేది ఈ విధానంపై ప్రజలలో అవగాహన పెంపు, ప్రయోజనాలపై చర్చలు, విధాన బలాలపై మద్దతు, లోపాలపై పరిష్కారాలకు మార్గదర్శనం చేసే సందర్భంగా పరిగణించాలి.కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రాలు, పరిశ్రమల సంఘాలు, వాణిజ్య మండలాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడం ప్రాశస్త్యం. ఈ విధానం ద్వారా దేశీయ పెట్టుబడులే కాకుండా, విదేశీ పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది. వ్యాపారానికి అనువైన విధానంగా దీన్ని అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. మొత్తంగా ఇది కేవలం పన్ను విధానం కాదని, దేశఆర్థిక సమీకరణకు ఒక నూతన దిశనిచ్చిన మార్గదర్శకంగా నిలుస్తున్నది. పన్ను చెల్లింపు దారులు, వ్యాపారులు, పాలకులు, ప్రజలందరూ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పన్నుల వ్యవస్థను నడిపించేలా జీఎస్టీ కౌన్సిల్ ఇప్పటి వరకు 55కి పైగా సమావేశాలు నిర్వహించింది. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వేదిక సహకారాన్ని పెంపొందించడమే కాకుండా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవసరాలను తీర్చేలా వీలు కల్పించింది.జీఎస్టీ పన్ను వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చినప్పటికీ రేట్ల సరళీకరణ, కాంప్లయన్స్ లోపాలను పరిష్కరించడం, ఐటీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థ మరింత సమర్థవంతమైన, ఏకీకృత, పారదర్శక పన్ను విధానానికి పునాది వేస్తుంది

# జగన్ పాదయాత్ర 2.0

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయింది. టీడీపీ-జనసేన-బీజేపీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చంద్రబాబునాయుడు సీఎం అయ్యారు. జనసే అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఈ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ క్రమంలో కూటమి సర్కార్ ఏడాది పాలన తర్వాత వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోసారి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. యువనేతల సమావేశంలో తన నిర్ణయం ప్రకటించారు.జగన్ 2017-19 మధ్య చేసిన 'ప్రజా సంకల్పయాత్ర' ఆయనకు రాజకీయంగా గణనీయమైన విజయాన్ని అందించింది. ప్రజల మధ్య ఉండడం, వారి సమస్యలను ఆలకించడం ద్వారా ఆయన వైసీపీని అధికారంలోకి తీసుకొచ్చారు. రాబోయే ఎన్నికల ముందు కూడా అదే ఆయుధం ఎక్కుపెట్టాలని జగన్ భావిస్తున్నారు. ఇది జగన్ 'మాస్ కనెక్ట్' వ్యూహాన్ని సూచిస్తుంది. ఈ పాదయాత్ర ద్వారా, ప్రజలతో భావోద్వేగ సంబంధాన్ని బలోపేతం చేయడంతోపాటు, ప్రతిపక్ష హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేయాలని జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు.జగన్ తన ప్రకటనలో సోషల్ మీడియా శక్తిని గుర్తించారు, దాన్ని 'ఫోన్ ఆయుధం'గా పేర్కొన్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియా రాజకీయ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోంది. వైసీపీ సోషల్ మీడియా విభాగాన్ని బలోపేతం చేయాలని, అన్యాయాలను తక్షణం సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని జగన్ సూచించడం, ఆధునిక రాజకీయ వ్యూహంలో డిజిటల్ వేదికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఈ వ్యూహం ద్వారా యువ ఓటర్లను, సోషల్ మీడియా యాక్టివిస్టులను ఆకర్షించి, పార్టీ సందేశాన్ని వేగంగా, విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జగన్ భావిస్తున్నారు.జగన్ యువ నేతలతో సమావేశంలో ఈ ప్రకటన చేయడం కేవలం పాదయాత్ర గురించి మాత్రమే కాదు, పార్టీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేయడంలో కూడా భాగమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. యువ నేతలను ఉత్సాహపరచడం, వారిని సోషల్ మీడియా యాక్టివిస్టులుగా మార్చడం ద్వారా, జగన్ రాజకీయంగా చురుకైన, డిజిటల్ యుగానికి అనుగుణమైన నాయకత్వాన్ని తయారు చేస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా యువతలో వైసీపీ ఆకర్షణను పెంచడంతోపాటు, ఎన్నికల్లో కీలక ఓటరు వర్గాన్ని లక్ష్యం వ్యూహంగా పేర్కొంటున్నారు.

# ఫ్రీ బస్సు కోసం పక్కా ప్లాన్

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకంలోని మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించనున్నారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలన్నారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే ఉండాలని? ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.'బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు



రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి" అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందిని సీఎంకు అధికారులు వివరించారు.రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది.ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు.ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు.

మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది.ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

# బనకచర్లకు నో ఎందుకు...?



**ఏలూరు-సూర్య వాస్తవం**

బనకచర్ల. ఇటీవల తరచూ వినిపిస్తున్న మాట ఇది.. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత బనకచర్ల ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. సముద్రంలో కలిసే వృధా జలాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు భావి ంచారు. అది పోలవరం ప్రాజెక్టు ద్వారా బనకచర్లకు అను సంధానించి.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే తెలంగాణ ప్రభుత్వంతో పాటు అక్కడ అన్ని రాజకీయ పక్షాలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు నిర్మించకూడదని భావిస్తున్నాయి. అయితే ఇది సంక్లిష్టమైన సమస్యగా మారిన నేపథ్యంలో.. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం పర్యావరణ అనుమంతులను నిలిపివేసింది. ఒక విధంగా ఇది ఏపీలో కూటమి ప్రభుత్వానికి షాకింగ్ పరిణామమే. వృధా జలాలను విని యోగిం చుకునేందుకు.. గోదావరిలోనిరంతర నీటి ప్రవాహం ఉంటుంది. వర్షాకాలంలో అయితే భారీ స్థాయిలో వరద నీరు పోటెత్తుతుంది. ఆ సమయంలో వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంది.

అయితే ఏటా వృధాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు వీలుగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలన్నది ఏపీ ప్రభుత్వ లక్ష్యం. ఏపీ ప్రభుత్వం చెబుతున్నట్లు ఏటా రెండు వేల టీఎంసీల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోతుంది. అందుకే వరదల సమయంలో 200 టీఎంసీలను మళ్లించాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. అందుకే గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది.రూ. 80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు సైతం ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.ఈ ప్రాజెక్టుతో రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుంది అన్నది ప్రభుత్వ ఆలోచన. తాగునీటితోపాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. సాగర్ కుడి కాలువ, వెలిగొండ, గాలేరు, నగరి, కెసి కెనాల్, తెలుగు గంగా కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది ఏపీ ప్రభుత్వం నిర్ణయం. మూడు దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నది ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణానదిలోకి.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్ లోకి నీటిని మళ్లించనున్నారు. అక్కడ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్కు తరలించాలన్నది ఏపీ సర్కార్ ప్లాన్. అంటే మొదటి దశ కింద పోలవరం నుంచి కృష్ణా నదికి జలాల మళ్లింపు, సెకండ్ ఫేజ్ కింద గొల్లపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి.. అక్కడ నుంచి తరలించాలని చూస్తోంది. ఫైనల్ ఫేస్ లో భాగంగా బొల్లపల్లి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ కు నీళ్లు తరలించాలని చూస్తోంది.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గాను 48 వేల ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉంది. రెండు టన్నెళ్లు, 9 చోట్ల పంప్ హౌస్ ల నిర్మాణం అవసరం. కొన్నిచోట్ల గ్రావిటీ కాలువల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టుకు తెలంగాణనుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇంకా తెలంగాణతో సరిహద్దు జలాల వివాదం తేలాల్సి ఉంది. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే.. ముందు ఆ నది యాజమాన్యం బోర్డు, సిడబ్ల్యూసి, జల్ శక్తి మంత్రి అధ్యక్షతన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎఫెక్స్ కౌన్సిల్లో చర్చించి అనుమతి పొందాలి. అయితే ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తోందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో.. పర్యావరణ అనుమతులు రాలేదని బ్రేక్... మాత్రమే అంటున్న టీడీపీ బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది.


బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు.

మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. .. తెలంగాణ నుంచి అనేక అభ్యంత రాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయా లంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది.

దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# చంద్రబాబు కొత్త ఒరవడి

**రాజమండ్రి - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. పాలనలో తనదైన ముద్ర వేసుకు న్నారు. విజనరీ నాయకుడుగా, టెక్నాలజీ సీఎంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రజలతో మమేకమవుతూ జనాదరణ పొందుతు న్నారు. ఏడాది పాలనలో ప్రతీనెల ఒక జిల్లా లేదా ప్రాంతంలో పర్యటించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టి, ప్రజా సంబంధాలను కొంతవరకు నిర్లక్ష్యం చేస్తారనే విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే, 2024 జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఈ విమర్శలను పటాపంచలు చేస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం బలోపేతం చేసుకుంటున్నారు. ప్రతినెలా 1వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటూ, గత 12 నెలలుగా అత్యంత చురుకైన ప్రజా సంబంధాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయన గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యలను స్వయంగా అర్థం చేసుకుంటూ, పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.2024 జూలై 1 నుంచి ప్రారంభమైన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు స్వయంగా భాగస్వామ్యం కావడం ఒక విశేషం. ఈ కార్యక్రమం కేవలం పింఛన్‌ల పంపిణీకే పరిమితం కాకుండా, ప్రజలతో రోజంతా గడిపే అవకాశంగా మారింది. తాజాగా కోవూరు మల్కాపల్లి గ్రామంలో ఈ రోజు (జూలై 1, 2025) జరిగిన 12వ వరుస కార్యక్రమంలో, చంద్రబాబు పింఛన్ పంపిణీని పూర్తి చేసి, స్థానికులతో సంభాషించి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఈ విధానం ద్వారా, ఆయన పాలనా వ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వంటి విపక్ష నాయకులు చంద్రబాబు వయస్సును సమస్యగా పేర్కొంటూ విమర్శలు చేసినప్పటికీ, చంద్రబాబు తన చురుకైన పనితీరుతో వాటిని తిప్పికొడుతున్నారు. 70 ఏళ్ల వయసులోనూ, ఆయన ప్రజల మధ్యకు వెళ్లి, వారితో నేరుగా మాట్లాడటం, సమస్యలను వినడం వంటి చర్యల ద్వారా తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. గతంలో జగన్ ప్రభుత్వంలో ఇటువంటి చురుకైన ప్రజా సంబంధాలు కనిపించలేదని, చంద్రబాబు ఈ విషయంలో ఒక ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పవచ్చు.ఈ నూతన విధానం కేవలం పింఛన్ పంపిణీకే పరిమితం కాకుండా, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించే వేదికగా మారింది. ప్రతి నెలా గ్రామస్థాయిలో జరిగే ఈ కార్యక్రమాలు, పాలనా వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచుతున్నాయి. ఈ చర్యలు ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకాన్ని కలిగిస్తూ, చంద్రబాబు నాయకత్వంలో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి

# సేవ చేయడంలోనే ఆనందం...

**- టోరియంట్ మెడిసిన్ కంపెనీ ఎంప్లాయ్ జబివుల్లా**



**రాయచోటి - సూర్య వాస్తవం, జులై 02:** సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందని ప్రతి పేదవాడికి ఎంతో కొంత సహాయార్థం సేవ చేసినట్లయితే దేవుడు కూడా మనకు సహకరిస్తాడని టోరింటో మెడిసిన్ కంపెనీ ఎంప్లాయ్ షేక్ జబివుల్ల అన్నారు. రాయచోటి లోని రాయుడు కాలనీలో ఎంపీపీ పాఠశాలలో బుధవారం పాఠశాల కు వితరనగా బెల్ (గంట) ను అందజేశారు. గత కొన్ని రోజుల క్రితం పాఠశాలకు ఏదో ఒకటి సహాయార్థం చేయాలని పాఠశాల సిబ్బంది షేక్ జబీబుల్లాకు తెలియజేయడంతో ఆ హామీని నెరవేర్చినట్లు పాఠశాల హెచ్ఎం సురేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తన సంపాదనలో ఎంతో కొంత నిరుపేద విద్యార్థులకు ఖర్చు చేసినట్లయితే వారి రుణం దేవుడు ఏదో ఒక రూపంలో వారి బిడ్డలకు సహాయార్థంగా రుణపడి ఉంటారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పేదలకు సహాయార్థం ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా తమపై ఉందని ఆయన అన్నారు. ఆయనతో పాటు రియల్ ఎస్టేట్ స్వామికొండ. ద్వారక మెడికల్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ శ్రీకాంత్ (హైదరాబాద్) నజీర్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల పనితీరులో మార్పు కనిపించాలి

**- ఐసీడీఎస్ పీడీ నాగమణి**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 2:** అంగన్వాడీ వర్కర్ల పనితీరులో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత సీడీపీఓలు, సూపర్ వైజర్లదేనని ఐసీడీఎస్ పీడీ నాగమణి స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్ వైజర్లతో బుధవారం సాయంత్రం తన ఛాంబర్ లో పీడీ సమీక్ష నిర్వహించారు. అనంతపురం అర్బన్ లో కొందరు అంగన్వాడీల పని తీరుపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. నాలుగైదు కేంద్రాలు తనిఖీ చేయగా లోపాలు గుర్తించినట్లు వివరించారు. ప్రతి నెలా టీ. హెచ్.ఆర్ విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎఫ్.ఆర్.ఎస్ లక్ష్య సాధనలో వెనుకబడితే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ప్రతి నెలా 5వ తేదీలోగా అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేయాల్సిందేనని పేర్కొన్నారు. కొందరు అంగన్వాడీలు యాప్ లు పనిచేయడం లేదని సాకులు చెప్పడం క్షమించరానిదన్నారు. కొందరు కేంద్రాలకు వెళ్ళకుండానే ఫోటోలకు ఫోటో తీసి అప్ లోడ్ చేయడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వాటిని సహించేది లేదని వెల్లడించారు. కాంట్రాక్టులు నాసిరకం సరుకులు సరఫరా చేస్తే తీసుకోవద్దని తెలిపారు. రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. యాప్ లకు సంబంధించి టెక్నికల్ సిబ్బంది సహకరించకపోతే తన దృష్టికి తీసుకురావాలని పీడీ ఆదేశించారు. అర్బన్ సీడీపీఓ అనూరాధ, రూరల్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీమున్నీసా పాల్గొన్నారు.

# పీర్ల పండుగకు రాష్ట్ర మంత్రికి ఆహ్వానం



**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 2:** పవిత్ర ఉరుసు మహోత్సవం సందర్భంగా జరుగనున్న శ్రీ శ్రీ శ్రీ హాజరత్ గంధపు పీరు వారి పీర్ల పండుగ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆ ఉరుసు నిర్వాహకులు బుధవారం ఆహ్వానించారు. జూలై 5 న రాత్రి 10 గంటలకు గంధపు బాందీ ఊరేగింపు చిన్నమండెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను సమీక్షించిన నిర్వాహకులు, మంత్రి కి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ పండగ మహోత్సవ సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సందల్ సాహెబ్ మకాన్ కమిటీ వారికి మంత్రి సూచన చేశారు. ఈ సందర్భంగా ఉరుసు ఉత్సవాల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సాయం

**- చిన్నప్ప రెడ్డికి మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు అందజేత**

**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 02:** అన్నమయ్య జిల్లా పరిధిలోని గాలివీడు మండలం అవులరెడ్డిగారి పల్లెకు చెందిన అవుల చిన్నప్ప రెడ్డి అనారోగ్య సమస్యలతో శస్త్రచికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరంగా ఉండటంతో, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని సహాయం కోరగా మంత్రి మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి సహాయహస్తం అందించారు.



మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అవుల చిన్నప్పకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర - 2047 విజన్ అమలులో

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయండి

**- సంబంధిత అధికారులను ఆదేశించిన రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**- నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు చర్యలు తీసుకోండి : జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**







**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 2:** స్వర్ణాంధ్ర - 2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు విశేష కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాయచోటి ఆర్డీఓ, ఎంపీడీఓలు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సరంలోనే అభివృద్ధి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయో చూస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోషల్ ఇంజనీరింగ్ అనే సిద్ధాంతం తో ముందుకు వెళ్తున్నారన్నారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేస్తే తప్పకుండా స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధ్యమైతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను వారికి అందుతున్నాయా లేదా అని వారినే స్వయంగా అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా మెరుగైన సేవలు కూడా అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రధానంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రజలకు ఉన్న సమస్యలను స్వయంగా తెలుసుకొని వారి సమస్యలను త్వరగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు కలిస్తే ఒక మెరుగైన అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 175 నియోజకవర్గాలకు సంబంధించి ఒక సిస్టం ని ఏర్పాటు చేసారని...నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్కు ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారన్నారు. వైస్ చైర్మన్ గా ఆర్డీఓ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఎంపీడీవో కన్వీనర్గా వ్యవహరిస్తారని మంత్రి తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకొని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి గత 40 సంవత్సరాలలో 20 బెడ్ల నుండి 50 బెడ్లకు వస్తే ఈ ఏడాదిలోనే అదనంగా 100 బెడ్లను తీసుకురావడం జరిగిందని మంత్రి తెలిపారు.

సిసియు యూనిట్లు రాష్ట్రంలో నలుగురికే కేటాయిస్తే మన నియోజకవర్గానికి ఒకటి మంజూరు అవ్వడం జరిగిందని మంత్రి వివరించారు. దాదాపు 24 కోట్ల రూపాయలతో ఈ క్రోమాకేర్ యూనిట్లను ఏర్పాటు చేయడం అయ్యిందని తెలిపారు. గువ్వల చెరువు టన్నెల్ కూడా 950 కోట్లతో టెండర్లకు పిలుస్తున్నామన్నారు. కడప నుండి పీలేరు వరకు ఫోర్ లైన్ రెండు ప్యాకేజీ రోడ్లు వస్తున్నాయని తెలిపారు. గండి రోడ్డు కూడా మరమ్మతులు చేస్తున్నామని, రింగురోడ్ కూడా ఫోర్ లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కార్యాలయంలో ఐదు మంది సచివాలయ సిబ్బంది చొప్పున ఆరు నియోజకవర్గాల్లో 30 మంది చొప్పున పనిచేయడానికి సచివాలయ సిబ్బందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు - బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్..ఇలా 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళిక రూపకల్పనకు నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని... ఈ మేరకు ప్రభుత్వం నిర్ధేశించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా మన్నారు. డేటా మేనేజ్మెంట్, డేటా అనాలసిస్లో సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వా లక్ష్యాలు సాధించేందుకు తపనతో పని చేయాలన్నారు. ఇకనుండి నియోజకవర్గ యూనిట్లే కీలకం కానున్నాయన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు వెళ్లి అన్ని పారామీటర్లలో 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్-2047 తీసుకొస్తే దానికి అనుబంధంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనకు నిరంతర కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకోనేలా విస్తృత అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, నియోజకవర్గ మండలాల తహసిల్దార్ లు, మండల అభివృద్ధి అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్‌గా తనకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**కదిరి, తనకల్లు - సూర్య వాస్తవం, జూలై 2:** సాధారణంగా ప్రభుత్వ శాఖల్లోని కొన్నింటిలో అధికారులకు లంచం ఇవ్వనిదే ఫైలు ముందుకు కదలదు. అయితే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగే అవినీతి అక్రమాలకు అడ్డు అదుపే ఉండదు తమ పని కోసం ప్రజలు కొంత డబ్బును లంచం రూపంలో ముందుగానే అధికారులకు ఇచ్చినప్పటికీ ఆ పనిని పూర్తి చేసుకునేందుకు ప్రజలకు తల ప్రాణం తోకకు వస్తుంది. డబ్బులు తీసుకోవడమే కాకుండా అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తూ రోజు ప్రజలను కార్యాలయం వైపు తిప్పుకోవడం సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారులకు పరిపాటిగా మారిపోయింది. తనకల్లు మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారిపోయింది. ఈ కార్యాలయంలో ప్రజలు చిన్న పని కావాలన్నా కూడా అక్కడి సబ్ రిజిస్టర్ తో పాటు కార్యాలయ సిబ్బంది కూడా పైసలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పనులు త్వరగా ముగించుకొని




సకాలంలో తిరిగి ఇళ్లకు వెళ్దాం అనుకునే ప్రజలకు ఇక్కడి అధికారులు చుక్కలు చూపిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈసీ అడంగల్ కావాలన్నా ఇతర డాక్యుమెంట్లు తీసుకోవాలన్న గవర్నమెంట్ కు చెల్లించాల్సిన ఫీజు తో పాటు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కొందరు దళారీలు ఉండడమే కాకుండా వారికి డాక్యుమెంట్ రైటర్లు కూడా కొందరు మధ్య వర్తులుగా ఉన్నారు. రెవెన్యూ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి లింకు ఉంటుంది ఒక భూమి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఒక వ్యక్తి పైన రిజిస్టర్ చేయించుకోవాలంటే రికార్డులకు సంబంధించి రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది ప్రజలు రెవెన్యూ అధికారులకు సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారులకు డబ్బులు తెచ్చుకోవడం తలకి మించిన భారంగా మారుతోంది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సబ్ రిజిస్టర్ అధికారుల అవినీతి అక్రమాలకు కళ్లెం వెయ్యకపోతే ప్రజలు, ప్రజా సంఘాల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# జగన్ అంటే వినాశనం - చంద్రబాబు అంటే అభివృద్ధి

**- అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం : ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 2:** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో జగన్ రెడ్డి వినాశనం సృష్టించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి కార్యక్రమాన్ని అనంతపురం నగరంలో ప్రారంభించారు. 39 వ డివిజన్ లక్ష్మీ నగర్ లో ఉదయం ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సాయంత్రం 35వ డివిజన్ లో సుపరిపాలనతో లేడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే ప్రభుత్వ పనితీరుపై ప్రజాస్పందనను తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను కూడా అడిగి తెలుసుకుని పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పుపి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్ళీ గాడిలో పెట్టారన్నారు. జగన్ అంటే వినాశనం చంద్రబాబు అంటే అభివృద్ధి అని ఎమ్మెల్యే అన్నారు. తొలి సంతకంతోనే మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించారని జగన్ రెడ్డి రాజకీయ కక్షతో



మూసివేసిన అన్న క్యాంటీన్లను మళ్ళీ తెరిపించారన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ల్యాండ్ యాక్ట్ రద్దు వంటివి చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు వేల రూపాయలు ఉన్న పింఛన్ ని 4 వేల రూపాయలు చేశారన్నారు. అదే జగన్ రెడ్డికి వెయ్యి రూపాయలు పింఛన్ పెంచడానికి ఐదేళ్లపాటు సమయం పట్టిందన్నారు. ఈ ఏడాది కాలంలోనే తొమ్మిది లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చారని 8.5 లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. రానున్న నాలుగేళ్లలో మొత్తం 25 లక్షలు ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతపురం జిల్లాలో 5 లక్షల ఉద్యోగాలు కచ్చితంగా కల్పిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 39 వడివిజన్ ఇంచార్జ్ చేపల హరి, 35వ డివిజన్ ఇంచార్జ్ రాజారావు, మాజీ ఎంపీ సైపుల్లా, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, జె ఎల్ మురళి, రాయల్ మురళి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిలు గాజుల ఆదెన్న, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మోద్దిన్, పలు కార్పోరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పి ఎల్ ఎన్ మూర్తి, కడియాల కొండన్న, బొమ్మినేని శివ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగుదేశం జిల్లా అధికార ప్రతినిధి సరుపూటి రమణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, కార్పొరేటర్ బాలాంజినేయులు, మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, సరళ, సరోజమ్మ, పావురాల శేఖర్, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణం, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, టిడిపి నాయకుడు రాయల్ మధు,టిడిపి నాయకులు సింగవరం రవి, గోళ్ళ సుధాకర్ నాయుడు, నారాయణస్వామి యాదవ్, నెట్టెం బాలకృష్ణ, రూపనగుడి రవి రాయల్, తాటి మధు, ఓంకార్ రెడ్డి, దాదా ఖలందర్, వడ్డే భవాని, అయేషా, కంఠాదేవి, మహేశ్వరి, చరిత, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధి ఉన్నవారు ఎవరూ మాజీ ముఖ్యమంత్రిని అలా మాట్లాడరు

### - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యలపై నగర మేయర్ వసీం ఆగ్రహం




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 2:** నిన్నటి రోజున అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని నీకు బుద్ధి ఉందా అంటూ ఆయన్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని బుద్ధి ఉన్న వారు ఎవరు మాజీ ముఖ్యమంత్రిని అలా మాట్లాడారని అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం హితవు పలికారు. బుధవారం అనంతపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినటు వంటి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓ మాజీ ముఖ్యమంత్రిని ఆ విధంగా మాట్లాడు తున్నా డంటే ముందు ఎమ్మెల్యేకి బుద్ధిఉందా అని ప్రజలు చర్చించు కుంటున్నా రన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో కేవలం సచివాలయాల ద్వారానే 1,20,000 మందిని సచివాలయం ఉద్యోగులుగా నియమిస్తే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అంటున్నారంటే అసలు ఎమ్మెల్యే గారికి బుద్ధి ఉందా అని సచివాలయం ఉద్యోగులు కూడా అనుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత నాలుగు రోజుల నుంచి ట్రాన్స్ఫర్లు నిర్వహిస్తున్నారే కనీసం అప్పుడైనా తెలుసుకోవాల్సింది ఎవరి హయాంలో సచివాలయ ఉద్యోగులను నియమించారన్నది తెలుసుకొని ఉంటే ఎవరికి బుద్ధి ఉందో తెలిసేదన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గారు ఐదేళ్లపాటు ప్రతినెలా పింఛను క్రమం తప్పకుండా వాలంటీర్లను ఇళ్ల వద్దకు పంపి పింఛన్ అందజేసేవారని గుర్తు చేశారు. ఆయన ప్రవేశపెట్టిన విధానాన్ని మీరు కూడా కొనసాగిస్తూ సచివాలయం ఉద్యోగుల చేత ప్రతినెల పింఛను ఇస్తున్నారని అది కూడా ఏదో కొత్త కార్యక్రమం నిర్వహించినట్లు ప్రతినెల పింఛన్ ఇవ్వడానికి వెళ్లి జగన్మోహన్ రెడ్డిని విమర్శిస్తున్నారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరము దాటుతున్న ఇప్పటిదాకా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక విమర్శలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. నిజంగా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశం ఉంటే ఎందుకు సూపర్ సిక్స్ పథకాల అమలు చేయలేదని మీరే మీ ముఖ్యమంత్రిని ప్రశ్నించాలని హితవు పలికారు. మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని జగన్మోహన్ రెడ్డి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని చేపడితే మీకు భయం వేసి ఆయన మీద ఎదురు దాడికి దిగుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీకి క్యాలెండర్ ప్రకారం కుల, మత,పార్టీ తారతమ్యం లేకుండా నేరుగా ఖాతాల్లోకి జమ చేసే వారన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ తల్లికి వందనం అని చెప్పి ఇప్పటిదాకా చాలామందికి డబ్బులు పడకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఉచిత బస్సు అమలు చేయడానికి సంవత్సరం అవుతున్న ఇంకా వాయిదాలతో కాలయాపన చేస్తున్నారే గాని ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడూ అని మహిళలు ఎదురు చూస్తున్నారు అన్నారు. గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అంటున్నారే గాని ఎందుకు సమయానికి డబ్బులు వేయడం లేదు అని నిలదీశారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో మంచి పరిపాలన అందిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే రెడ్ బుక్కు రాజ్యాంగం అంటూ కక్ష సాధింపు చర్యలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారన్నారు. అసలు ఆంధ్రప్రదేశ్లో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తోందా రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తుందా అన్న ప్రశ్న ప్రజల్లో ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిరోజు ఏదో ఒక డైవర్షన్ రాజకీయం చేస్తూ కక్ష సాధింపు చర్యలతో పాలన చేస్తున్నారని విమర్శించారు.

## డెంగ్యూపై విద్యార్థులకు అవగాహన

### - అదనపు జిల్లా వైద్యాధికారి



**సిద్దవటం - సూర్య వాస్తవం, జూలై 2:** డెంగ్యూ జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. మండలంలోని చాముండేశ్వరి పేటలో సెయింట్ ఆంథోని స్కూల్ లో బుధవారం డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల 1వ తేది నుంచి 30 వరకు జరుగుతున్న. డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా చాముండేశ్వరి పేటలో సెయింట్ ఆంథోని స్కూల్ లో డెంగ్యూ వ్యాధికి సంబంధించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు, అధ్యాపకులకు పలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. డెంగ్యూ వ్యాధికి సంబందించి విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు, ఇరుగుపొరుగు వారికి అవగాహన కల్పించాల్సిందిగా కోరామన్నారు. క్షయ ముక్తి భారత్ జాతీయ కార్యక్రమం గురించి వివరించామన్నారు. 3 వారాలు దగ్గు, జ్వరము, బరువు తగ్గుదల ఉన్నవారు దగ్గరలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకొని వ్యాధిని నిర్ధారించు కోవాలన్నారు. సాధారణంగా జరిగే జాతీయ టీకాల విధానాన్ని దగ్గరుండి సమీక్షించా మన్నారు. అలాగే మాధవరం-1 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో ల్యాబ్, టీకాల రిజిస్టర్ ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం పీహెచ్సీ వైద్యాధికారి శివకుమార్, సూపర్వైజర్లు నాగవల్లి, జ్యోతి కళ రమణయ్య, యానాదయ్య, ఏఎన్ఎం ఖుర్షీద్, ఆశా కార్యకర్తలు పెంచలమ్మ, శకుంతలలు పాల్గొన్నారు.

## మాధవరంలో చోరీ

### - 8 తులాల బంగారు 30 వేలు నగదు అపహరణ



**సిద్దవటం - సూర్య వాస్తవం, జూలై 2:** సిద్దవటం మండలంలోని మాధవరం -1 గ్రామం 10వ వీధిలో గుర్తు తెలియని దుండగలు సోమవారం రాత్రి 8 తులాల బంగారు, 30 వేలు నగదు చోరీకి పాల్పడినట్లు బాధితుడు మోదుగుల నరసింహులు తెలిపారు. మాధవరం -1 గ్రామంలో ఉన్న తన తండ్రి నరసింహులు (68) ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మృతి చెందారన్నారు. తన తండ్రి మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం పొత్తపి గ్రామానికి తన భార్య లక్ష్మీ ప్రసన్న తీసుకెళ్లగా . తండ్రి మృతి చెందారన్న విషయాన్ని తెలుసుకుని తాను కువైట్ నుంచి సోమవారం పొత్తపికి రావడం జరిగిందన్నారు. ఈ మేరకు సోమవారం గుర్తు తెలియని దుండగలు ఇంట్లోని 8 తులాలు బంగారు, 30 వేలు నగదు, ఒక మొబైల్ ఫోన్ను అపహరించుకుని వెళ్లారని బాధితుడు తెలిపాడు. చోరీ విషయాన్ని తెలుసుకున్న ఎస్సై మహమ్మద్ రఫీ, ఏఎస్ఐ సుబ్బరామచంద్రలు సంఘటనా స్థలానికి చేరుకుని కడప నుంచి క్లూస్ టీంను తెప్పించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్లూస్ టీం పోలీస్ కానిస్టేబుళ్ళు శంకర్, సురేంద్రలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వరం మహా గురుకులం..!

### - జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
### - మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎస్పీ అశోక్‌కుమార్
### - డా.బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకుల విద్యాలయంలో తరగతుల ప్రారంభోత్సవం






**కడప బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 2:** నాణ్యమైన విద్య, అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకులం విద్యాలయం పేద విద్యార్థుల పాలిట వరం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బుధవారం బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో ఆకాడమిక్ భవనాల్లో తరగతులు, వసతి గృహ భవనాల జిల్లా కలెక్టర్ డి శ్రీధర్ చెరుకూరి, మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకులం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వచ్చిందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి గాను 640 మంది విద్యార్థులతో అడ్మిషన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆధునాథనమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించే మహా గురుకులంలో చేరేందుకు అర్హులైయిన పేద విద్యార్థులను ప్రోత్సహించా లన్నారు. ఈరోజు భారత దేశం ఆర్థిక అభివృద్ధిలో 4వ స్థానంలో నిలుచుందంటే అందుకు కారణం మన విద్య వ్యవస్థపై మన ప్రభుత్వాలు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్లనే అన్నారు. మన పూర్వీక మహా ఋషులు అవలంభించిన ఒక విలువలతో కూడిన విద్య వ్యవస్థ మన దేశంలో ఇప్పటికీ కొనసాగుతోందని అలాంటి విద్యా వ్యవస్థే ఈ గురుకుల విద్యాలయ వ్యవస్థ అన్నారు. సమాజంలో పిల్లలకు అద్భుతమైన విద్యను అందించడమే ఒక గొప్ప నాయకుడి నిజమైన బాధ్యత అన్నారు. ఎక్కువగా రాజాకీయ నాయకులు తమ ఊర్లలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకే. మొగ్గు చూపుతారన్నారు. అయితే మైదుకురు ఎమ్మెల్యే మాత్రం మౌలిక వసతులకంటే ముందు విద్యాలయాన్ని నెలకొల్పితే ఎంతో మంది విద్యావంతులు, వారి ద్వారా ఎంతో మంది ప్రయోజకులు ఎత్పన్నం అవుతారన్న ఆలోచనతో మహా గురుకులం అభివృద్ధికి నిరంతరం శ్రమించారన్నారు. ఆయనతో పాటు ఆర్డీవో, అధికారుల కృషీ ఫలితమే ఈ మహా గూరుకులం పరిపూర్ణతకు నిదర్శనమని ప్రశంసించారు. అందరి సమిష్టి కృషితోనే మహా గురుకులం లాంటి ఆదర్శనీయ భవనాలు మన ముందు గొప్ప విద్యాలయాలుగా ఎదుగుతాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఈ మహా గురుకులం జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలను అందిస్తోందని, అలాగే 2027 విద్య సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమమైన ఫలితాలను అందివ్వాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఈ మహా గురుకులం జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో రెపరెప లాడించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ 2016 లో ఈ గురుకులం ప్రాజెక్టు నిర్మాణానికి సంబందించి అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి రూ. 21 కోట్ల వ్యయంతో మహా గురుకులం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంబందిత పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వంలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహించిందన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వారి ప్రత్యేక చొరవతో రెండు వారాల్లోనే పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను సమకూర్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా తాజాగా రూ.1.23 కోట్ల వ్యయంతో రోడ్లు, ప్లే గ్రౌండ్, సుందరీకరణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అడ్మిషన్లు పూర్తయ్యేలోపు అన్ని రకాల సిద్దం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు.

మైదుకురు నియోజకవర్గ అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ ఎంతో సహాయ సహకారాలు అందించారని అందుకు ప్రజల తరపున, తన తరుపున ధన్యవాదాలు తెలుపు కుంటున్నామన్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని 5 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంలో, అలగానూరు రిజర్వాయర్ కోసం రూ.36 కోట్లను మంజూరు చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడంలో, బి.మఠం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 6 కోట్ల విడుదలకు హామీ ఇవ్వడంతో, మహా గురుకులం పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయడంలో, అలాగే బీ.మఠంలో కబ్జాకు గురైన 10 ఎకరాల స్మశాన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన ఘనత జిల్లా కలెక్టర్ గారికే దక్కుతుందన్నారు. ఈ విద్యాలయాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉందన్నారు. అలాగే నియోజకవర్గానికే కాకుండా జిల్లాకే తలమానికంగా రూపు దిద్దుకోనున్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిర్మించేందుకు పలుగురాళ్ల పల్లె రెవెన్యూ భూమిలో 30 ఎకరాల భూమిని కేటాయించడం గర్వించదగ్గ విషయం అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అన్నింటికీ మూలం ఒక్క విద్యనే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఒక్క పాఠశాల ఎంతో మంది ప్రయోజకులను తీర్చిదిద్దుతుందన్నారు. నేటి విద్యార్థి భవిష్యత్తులో ఒక ఉన్నత అధికారిగానో, ఒక రాజకీయవేత్తగానో, ఒక శాస్త్రవేతగానో ప్రజలకు సేవ చేయవచ్చన్నారు. విద్యాలయాలు దేశ అభివృద్ధికి మూలాల అనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకుని భవిష్య త్వరలో కూడా విలువలతో కూడిన విద్యను అందించే పాఠశాలలను నెలకొల్పాలని, ఉన్న పాఠశాలలను కాపాడాలని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో చదివిన మేము మీ ముందు అధికార హోదాలో ఉన్నామనంటే క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, ఉన్నత ఆశయంతో చదవడం వల్లనే సాధ్యం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో చదవాలన్నారు. గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉషశ్రీ మాట్లాడుతూ ఒక గ్రామానికి బడి, గుడి ఉంటే ఆ గ్రామం ఆధ్యాత్మికంగా, వివేకవంతంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆ ప్రాంత విద్యార్థులు, మంచి విలువలతో కూడిన విద్యతో పాటు అక్కడి ప్రజలకు సంస్కృతీ సంప్రదాయాలు అలవాడుతాయన్నారు.

ఒక దేశం అభివృద్ధి కోరేవారు ఎవరైనా.. ప్రతి గ్రామంలో ఒక బడిని స్థాపించేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశానికి ముందు.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) లో రూ.1.23 కోట్ల తో చేపట్టిన అభివృద్ధి పనులు - సిసి రోడ్లు, విద్యుదీకరణ, ఆటస్థలం మరియు మొక్కల పచ్చదనం పనులకు సంబంధించి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, హాస్టల్ గదుల వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటిన అనంతరం క్రీడా మైదానం, రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో చివరగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు.. హాస్టల్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, డీఈవో శంశుద్దిన్, ఎస్ఎస్ఏ ఎపిసి ఎ. నిత్యానందరాజు,సోషల్ వెల్ఫర్ డిడి సరస్వతి, డ్వామా పిడి ఆది శేషారెడ్డి, ఎంపీపీ వీర నారాయణరెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తహసిల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఓ వీర కిషోర్, కానాల మల్లికార్జున రెడ్డి, ఎస్ ఆర్ శ్రీనివాసరెడ్డి, సాంబశివారెడ్డి తో సహా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# రియల్టర్ ప్రాణాలు తీసిన వడ్డీ రాకాసురులు

### - మదనపల్లెలో కోరలు చాస్తున్న క్రూర మృగాలు - అప్పు ఇచ్చేది కొంచెం తిరిగి వసూలు చేసేది కొండంత
### - పైసా పెట్టుబడి లేకుండా కోట్లల్లో వ్యాపారం - అమాయకులు, రియల్టర్లు ఉద్యోగులే వడ్డీ రాకాసురులకు టార్గెట్





**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 2:** నిన్న మొన్నటి వరకు గౌరీ లాంటి అమాయకులను నాశనం చేశారు. ఇప్పుడు మదనపల్లె నియోజకవర్గంలోని ఫేమస్ రియాల్టర్ బొజ్జ రాజేంద్రను బలి తీసుకున్నారు. ఇంకా ఎందరినీ వడ్డీ వ్యాపారులు బలి తీసుకుంటే అధికారుల్లో కదలిక వస్తుందో. బొజ్జ రాజేంద్ర కుటుంబాలు లాగా ఇంకెందరి కుటుంబాలు అనాధలుగా మారాల్సి వస్తుందో. తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన వడ్డీ వ్యాపారులు కూడా మదనపల్లెలో కుప్పలు తెప్పలుగా చక్రవడ్డీలకు అప్పులు ఇస్తూ అమాయకులను వేధిస్తున్నారు. తమిళనాడు వడ్డీ వ్యాపారులకు దినసరి కూలీలే టార్గెట్. తెల్లవారి ఆరు గంటలకే.. ఇంటి ముందు వడ్డీ వ్యాపారి వాలిపోయి లెక్కల బుక్కు తిరగేస్తూ చిట్టా విప్పి చదువుతూ ఈ వారం కంతు కట్టి తీరాల్సిందే. అంటూ బూతు పురాణాలు ప్రారంభిస్తాడు. మదనపల్లెలో వడ్డీ రాకాసురులు రాజ్యమేలుతున్నారు. వడ్డికి వడ్డీ వసూలు చేస్తూ రాబందులుగా మారి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. ఈ కోవకు చెందినదే మొన్న మదనపల్లె రెడ్డీస్ కాలనీలో ఉండే కారు డ్రైవర్ భార్య గౌరీ లక్ష అప్పుకు పదిన్నర లక్షలు వడ్డీ కట్టి కుటుంబం శిథిలమైపోయిందని కంటతడి పెట్టి మీడియా ముందు వాపోయింది. ఈరోజు అనగా బుధవారం సాయంత్రం మదనపల్లి అమ్మినేని వీధిలో కాపురం ఉండే పేరు ప్రఖ్యాతులు ఉన్న రియల్టర్ బొజ్జ రాజేంద్ర కు వడ్డీ రాకాసురులు వేధించ డంతో గౌరీ గతి పట్టింది. ఆడది అయినా ఆమె చనిపోలేదు. కానీ మాగాడు గా వడ్డీ రాకాసురులను ఎదిరించలేక రియల్టర్ బొజ్జ రాజేంద్ర ఓడిపోయాడు. సెల్ఫీ వీడియో తీసుకుని ఉరేసుకుని మృతి చెందాడు. చనిపోయే ముందు సెల్ఫీ వీడియోలో మాట్లాడిన మాటలు వింటున్న ప్రతి ఒక్కరు కంటతడి పెట్టాల్సిన దుస్థితి మదనపల్లిలో నెలకొంది. రియల్టర్ బొజ్జ రాజేంద్ర మాట్లాడిని చివరి మాటలు వడ్డీ రాకాసురుల వేధింపులు తాళలేక సమాజంలో భార్యా పిల్లలతో అందరిలాగా బతకాలని చాలా ఆశ ఉంది. సమాజంలో గౌరవంగా బ్రతకాలని ఉంది. ఎన్నో కష్టాలు పడతావున్న.. ఎక్కడో ఏమరిపోయి మోసపోతున్న ఏదో అనుకుంటే ఏదో అయిపోతుంది. నా బిడ్డకు తోడుగా ఉండవలసిన వాడిని నా బిడ్డకు భార్యకు శాపంగా మారిన వారికీ అన్యాయం చేసి వెళ్ళిపోతున్నా.. ఎక్కడ డబ్బు కట్టడు.. ఆయన ముంచేస్తాడని చెడు ప్రచారం చేశారు. ఎట్ల పడితే అట్లా మాట్లాడి, వడ్డీ మీద వడ్డీలు వసూలు చేసి నన్ను ఎక్కడా కాకుండా చేశారు. చాలా కోలు కోలేని పరిస్థితిలో ఉన్న.. అసలు ఏం మాట్లాడాలో అర్థం కాలేదని ఉద్వేగంగా కన్నీటిపర్వంత మయ్యాడు. అప్పులోళ్ళు నా ప్రాణం తీసేస్తున్నారు. నన్ను సమాజంలో బ్రతకనివ్వడం లేదు. అందుకే వెళ్ళిపోతున్న.. అంటూ చివరి సారిగా కంటతడి పెట్టి తన ఆఫీసులోనే మోల్డింగ్ కమ్మికి తడుతో ఉరివేసుకొని నేను ఎవరికీ ఏ హాని చేయలేదు.. బ్లాక్మెయిల్ తట్టుకోలేక చనిపోతున్నాని చనిపోయాడు. ఘటనపై రెండో పట్టణ ఎస్ఐ రషీద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## హరిజనవాడ గ్రామస్తులకు
## శాశ్వత తాగునీటి సమస్యను తీర్చిన మంత్రి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 02:** రాయచోటి మండలం యండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎగువ హరిజనవాడ ప్రజలు ఎన్నో ఏళ్లగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆ హరిజనవాడలో శాశ్వతంగా బోరు వేయించి బుధవారం నూతన బోర్ మీటర్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## నేడు రామనపల్లెకి ఎమ్మెల్యే పుత్తాకృష్ణ చైతన్య రెడ్డి రాక



**చెన్నూరు–సూర్య వాస్తవం, జూలై 2 :** కమలాపురం శాసనసభ్యులుపుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మండ లంలోని రామన పల్లె గ్రామానికి మధ్యాహ్నం నాలుగు గంటలకు విచ్చేస్తున్నట్లు ఎంపీ డీవో కిరణ్ మోహన్ రావు ఒక ప్రకటనలో తెలి యజేశారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ సు పరిపాలనలో తొలి అడుగు భాగంగా ఆయన మండలంలోని రామనపల్లె గ్రామ పంచాయతీలో పాల్గొన నున్నట్లు ఆయన తెలి యజేశారు. మండల వివిధ శాఖల అధికారులు తమ తమ డిపార్ట్మెంటులకు సంబంధించిన ప్రగతి నివేదికలు తీసుకొని కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆయన తెలియజేశారు. రామనపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి సమాచారంతో అధికారులు పాల్గొనవలసిందిగా ఆయన తెలియజేయడం జరిగింది.

## బుద్ధునికొండలో విగ్రహాలు ధ్వంసం..

### - బుద్ధుని "తల" నరికి కాళ్ల దగ్గర పెట్టిన వైనం
### - సీసీ కెమోరాలు కూడా ధ్వంసం..



**మదనపల్లె– సూర్య వాస్తవం, జూలై 2 :** మదనపల్లె మండలంలోని అంకిశెట్టిపల్లి పంచాయతీ, "బుద్ధునికొండ"పైనున్న తథాగతుడు గౌతమ బుద్ధుని విగ్రహం ధ్వంసం చేశారు. దిమ్మెపై నుండి విగ్రహాన్ని క్రిందకు తోసేసి, "తల"ను నరికి, కాళ్ళ దగ్గర ఉంచారు. గతంలో కూడా దుండగులు ఇక్కడ మూడు విగ్రహాలు, సీసీ కెమోరాలు ధ్వంసం చేశారు. గతంలో విగ్రహాల ధ్వంసంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోలేదు. అందుకే దుండగులు బరితెగించి మళ్ళీ నాలుగో విగ్రహం ధ్వంసం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా బుద్ధుని విగ్రహాల ధ్వంసంపై తీవ్రంగా స్పందించాలని స్థానికులు విసికే నాయకులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలి

### - కడప రేంజర్ ప్రసాద్



**సిద్ధవటం – సూర్యవాస్తవం, జూలై 2:** పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచాలని కడప రేంజర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన రాజీవ్ స్మృతివనంలో మాట్లాడుతూ కడప ఫారెస్టు రేంజ్ పరిధిలోని జేఎంజే కళాశాలకు ఎదురూగా ఉన్న రాజీవ్ స్మృతి వనంలోని నర్సరీలో వేప, నేరేడు, ఉసిరి, ఎర్రచందనం, కానుగ, నెమలినారా, గన్నేరు, గుల్ మహల్, తదితర రకాలకు చెందిన 4 లక్షల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈనెల 5వ తేదీన మొక్కలను పంపిణీ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థి మొక్కలను నాటే విధంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. నాటి ప్రకృతిని పరిరక్షించేలా విద్యార్థులు బాధ్యతలు తీసుకోవాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను స్వీకరించి నాటితే కాలుష్య రహిత ఆరోగ్య వంతమైన గ్రామాన్ని తీర్చి దిద్దుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఫారెస్టు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువలు నిండి రోడ్డుపై నిలిచిన నీరు



**హిందూపురం– సూర్య వాస్తవం, జూలై 2 :** పురం మున్సిపాలిటీ పరిధిలో న్యూ హస్నాబాద్ సాయిబాబా ఆలయం వెనక భాగంలో క్రాసులో కొద్దిపాటి వర్షానికే రహ దారిపై నీరు నిలబడింది. మురుగు నీటి కాలువల్లోని నీరు పూర్తిగా రహ దారిపై నిలబడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత మునిసిపల్ అధికారులను కోరుతున్నారు.

## మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

### - జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల వినతులను ఓపికతో స్వీకరించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి–సూర్య వాసం,జూలై 02:** రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా కేంద్రం మైన రాయచోటి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను ఎంతో ఓపికగా సమస్యలు వింటూ స్వీకరించి వారి సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు. దీంతో అర్జీ దారులు మంచిది మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# విద్యుదాఘాతంతో పోలు పైనే కుప్పకూలిన కూలీ..

### - ఎలక్ట్రీషియన్ పరిస్థితి విషమం



**మదనపల్లె– సూర్య వాస్తవం, జూలై 2 :** విద్యుత్ లైన్ లో ఏర్పడిన అంతరాయానికి మరమ్మత్తులు చేస్తున్న కూలీకి కరెంట్ షాక్ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో అర్ధరాత్రి ఓ లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ఫోల్ ను ఢీకొనడంతో పోల్ విరిగిపోయి కరెంట్ తీగలకు వేలాడుతూ నిలబడింది.సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్ నరసింహయ్య ద్వారా పక్కనే మరో పోల్ ను ఏర్పాటు చేశారు. విరిగిన పోయిన పోల్ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన పోల్ లోకి విద్యుత్ తీగలను మార్చేందుకు కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులకు వచ్చిన నిమ్మనపల్లి మండలం, తవళం గ్రామం, ఉంటావారిపల్లెకు చెందిన రామప్ప కుమారుడు వి.వెంకటరమణ (35) ను లైన్ ఇన్స్పెక్టర్ మస్తానయ్య, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీనివాస్ లు విద్యుత్ పోలును ఎక్కమన్నారు. ఎల్సీ తీసుకున్నారా.. సార్.. అని కూలీ వెంకటరమణ అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరించి తీసుకున్నామని శ్రీనివాస్ చెప్పాడు. అధికారులు చెప్పడంతో చేసేది లెరక కాంట్రాక్టర్ నరసింహయ్య పోల్ ఎక్కమని తన వద్ద ఉన్న కూలీ వెంకటరమణ ను పురమా యించాడు. చేసేది లేక ఆ కూలి పోల్ ఎక్కి వైర్లను ముట్టుకోగానే అందులో విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్ గురై పోల్ పైనే కుప్ప కూలి పోయాడు. అప్పటి కప్పుడు విద్యుత్ సరఫరా నిలిపి వేసి, కుప్ప కూలి తీగలపై పడిన కూలి వెంకటరమణ ను కిందకు దింపి ఆస్పత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్షమే కూలీల పాలిట శాపం విద్యుత్ శాఖలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కిందిస్థాయి ఉద్యోగులు, కూలీలు ప్రమాదాల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. పట్టణ నడిబొడ్డున విద్యుత్ పోల్ విరిగిపోయి తీవ్ర సమస్య ఏర్పడితే అధికారులు స్పందించిన తీరు దారుణంగా ఉంది. సంబంధిత లైన్ మెన్ అజయ్ బాబు అందుబాటులో లేక పోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న లైన్ ఇన్స్పెక్టర్ మస్తానయ్య, సచివాలయ ఉద్యోగి, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీనివాసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎల్సీ తీసుకోకుండానే కూలీ ని పోల్ ఎక్కించి ప్రమాదానికి కారణమయ్యారు. తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్న అధికారుల తీరులో మార్పు రావడం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

**ఇష్టారీతిగా ఎల్ సీ లు జారీ..** ఏదైనా విద్యుత్ పోల్స్, 11 కేవి ల వద్ద సమస్యలు ఏర్పడితే సంబంధిత ఏడీ, ఏఈ లు సంఘటనా స్థలాన్ని సందర్శించి, ఎల్‌సీలు తీసుకోవాలి. అయితే వాళ్లు ఫీల్డ్ కు వెళ్లకుండా లైన్ మ్యాన్ లు, జెఎల్ఎంల పైనే భారం వేస్తున్నారు. వారకి ఎల్సీలు తీసుకునే సౌలభ్యం కల్పించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు గొప్ప మంటున్నాయి ఉన్నతాధికారులు స్పందించి విధులు సక్రమంగా నిర్వహించింది ఏఈ లైన్ ఇన్స్పెక్టర్ ల పై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు






## సీఎం చంద్రబాబుని కలిసిన రాష్ట్ర టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు


**రాయచోటి–సూర్య వాస్తవం, జూలై 2:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విజయవాడలో మంగళవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు, సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా టిడిపి నేత ప్రసాద్ బాబు రాయచోటిని యోజకవర్గంలోని వివిధ సమస్యలతో పాటు జిల్లాలోని పలు అంశాలపై చర్చించారని ఒక ప్రకటన లు ఆయన తెలిపారు.

## ఎస్‌విఐటికి అటానమస్ హోదా



**రాప్తాడు –సూర్య వాస్తవం, జూలై 2:** రాప్తాడు మండల లోని హంపాపురం దగ్గర ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ వి ఐ టి) కళాశాల అటానమస్ హోదా సాధించడం గర్వకారణమని ఎస్వీఐటి కళాశాల చైర్మన్ బి.వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ అనంతపూర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్ సుదర్శన్ రావు చేతుల మీదుగా అటానమస్ హోదా ఆర్డర్ కాపీలను ఎస్ వి ఐ టి యాజమాన్యం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కళా శాల అభివృద్ధిలో కీలకమైన మైలురాయి అని అన్నారు.విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంలో ఈ హెూదా తోడ్పడుతుంది అని తెలియజేశారు.అలాగే కళాశాల అభివృద్ధికి సంబంధించి వైస్ చాన్సలర్ పలు విలువైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెన్నెపూస రవీంద్ర రెడ్డి కళాశాల ఎండీ వెన్నెపూస రమాకాంత్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ ప్రిన్సిపల్ డా.టి.విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంది విత్తనాలు పంపిణీ



**కనేకల్ –సూర్య వాస్తవం, జూలై 2:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా ఉచితంగా అందిస్తున్న కంది విత్తనాలను కనేకల్ మండలంలోని హులికెర గ్రామ రైతులకు ఆ గ్రామ రైతు సేవా కేంద్రం లో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ ఉద్యోగులు మాట్లాడుతూ రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఉద్యోగులు సాయిరాం నాయక్, రవి మరియు తెలుగుదేశం నాయకులు నగేష్ రెడ్డి, నరేష్,గురుస్వామి పాల్గొన్నారు.

## చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో పూర్వ విద్యార్థి అన్న ప్రసాద వితరణ




**మదనపల్లె– సూర్య వాస్తవం, జూలై 2 :** చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో పూర్వ విద్యార్థి వి. వంశీ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు, వృద్ధులకు పోషక విలువలతో కూడిన మాంసాహార భోజనాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ కవితా రాణి మాట్లాడుతూ రమాదేవి మద్ది రెడ్డి ల కుమారుడు కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో పేదరికం వల్ల చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకొని అనంతరం ఐటిఐ పూర్తి చేసి ఎలక్ట్రిషన్ గా రానిస్తు తల్లిదండ్రులను పోషిస్తున్నాడని తెలిపారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా విద్యను అభ్యసించి నేడు పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు వృద్ధులకు అన్నదాన వితరణ చేయడం చాలా గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా వంశి రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి వి ఎస్ బాబు, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రధానోపాధ్యారాలు పట్నం గిరిజమ్మల్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ కృష్ణ చరణ్, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యా యులు ఆనంద వృద్ధాశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగింపుపై ప్రత్యేక చర్యలు..!

### - నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్. ఫజులుల్లా.



**నాయుడుపేట– సూర్య వాస్తవం, జూలై 2:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ పురపాలక సంఘంలో రోడ్డు ప్రక్కన ఆక్రమణలు తొలగింపుపై ప్రత్యేక చర్యలు చేపడు తున్నట్లు కమీషనర్ షేక్. ఫజులుల్లా తెలిపారు. బుధవారం నాయుడుపేట మున్సి పల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురపాలక సంఘం పరిధిలో పాత తహసిల్దార్ కార్యాలయం నుంచి జువ్వలపాలెం రోడ్డు వరకు పాత జాతీయ రహదారిపై ఉన్న ఆక్రమ ణలను తొలగిస్తున్నట్లు కమిషనర్ అన్నారు. ఇకపై రోడ్డు ప్రక్కన ఉన్న దుకాణదారులు రోడ్లపై నెట్టుడు బండ్లు, వస్తు సామాగ్రితో ఆక్రమణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులకు హెచ్చరించిన కమిషనర్..ఈ క్రమంలో రోడ్లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా దుకాణదారులు నడుచుకోవాలని అలా కాకుండా మీ పని మీరు చూసుకుంటారు అంటే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కొనియాడారు..

## బైక్ రైడింగ్ చేసే పోకిరీలపై ఉక్కు పాదం..!

### - అర్బన్ సీఐ బాబి హెచ్చరిక..



**నాయుడుపేట–సూర్య వాస్తవం, జులై 02:** తిరుపతి జిల్లా నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ రైడింగ్ చేసే పోకిరిలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు సిఐ బాబి అన్నారు..బుధవారం నాయుడుపేట పోలీస్ స్టేషన్ సీఐ కార్యాలయంలో సిఐ బాబి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిషేధిత సౌండ్ హారన్ చేస్తూ బైకులపై రైడింగ్ చేసే యువతపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ బాబి వెల్లడించినట్లు తెలిపారు.పోలీసుల సూచన లను ధిక్కరించి నిషేధిత సౌండ్ హారన్ వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. ముఖ్యంగా యువత బైక్ రైడింగ్ లు,నిషేధిత సౌండ్ హారన్ వాహనాలు నడపరాదని అలా నిబంధనలు ధిక్కరించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు కఠినంగా హెచ్చరికలు జారీ చేశారు..

# 2వవార్డులో సుపరిపాలనలో తొలి అడుగు

- ఏడాది కాలంలో రోడ్ల నిర్మాణానికి 75 కోట్లు అందించాం
- ప్రతి కుటుంబానికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి
- ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెల్లడ



మదనపల్లె- **సూర్య వాస్తవం, జూలై 2 :** మదనపల్లి పట్టణం రెండవ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మదనపల్లి శాసన సభ్యులు యం. షాజహాన్ బాషా, మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులతో కలసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ బుధవారం కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం వార్డు లో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అందించిన సంక్షేమ పథకాల గురించి, కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే ఇంకా స్థానిక ప్రజలు ఏదేని సమస్యల ఎదుర్కొంటున్న వాటి గురించి అడిగి తెలుసు కున్నారు. అలాగే తక్షణమే ఆయా సమస్యలపై స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగు తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వార్డు లో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, మురికి నీటి కాలువలు మంజూరు చేయాలని సంబదిత అధికారులను ఆదేశించారు. అలాగే ఒక ఇంట్లో తల్లికి వందనం ఇద్దరి పిల్లలకు అందడం, అదే ఇంట్లో 60 సంవత్సరాల వృద్ధురాలికి 4వేల రూపాయలు వృద్ధాప్య పెన్షన్ రావడం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం అ కుటుంబానికి ప్రయోజనం చేకూరిన విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకొని లబ్ధి పొందిన ఆనందంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు ప్రజల ముంగిటికే పాలకులు, నాయకులు, అధికారులు వెళ్లడం జరుగుతోందని చెప్పారు. బికే పల్లి నుండి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మెదలు పవట్టామన్నారు. తూర్పు స్థాయిలో కూటమి ప్రభుత్వం ప్రజలతో మమేకమై ముందుకు సాగుతొందన్నారు. ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం దత్తత తీసుకొని వారికి అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగు తోందని పేర్కొన్నారు. ఆగష్టు నుండి పూర్తి స్థాయి లో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమల్లోకి వస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయ నీయంగా ఉన్నప్పటికీ ప్రతినెల ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లిస్తూ, ఒకటవ తారీఖునే పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కితాబు నిచ్చారు. మొదటి ఏడాది లోనే మదనపల్లికి 75 కోట్లు రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సుపరిపాలనకు తొలి అడుగులో ఎమ్మెల్యే కందికుంట





**కదిరి -సూర్య వాస్తవం జూలై 2 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుపరిపాలనకు తొలిగడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కదిరి నియోజకవర్గం పరిధిలోని రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ కేంద్రంలో కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట ముఖ్యఅతిథిగా విచ్చేశారు, గ్రామంలోని మహిళలు, ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు తండోప దండాలుగా హాజరై శాసనసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు, మహిళలుమంగళ హారతులతో ఘనంగా ఆహ్వా నించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల హామీలలో భాగంగా ప్రతి ఒక్కటి తూచా తప్పకుండా నెరవేరుస్తూ ప్రజల మన్నలలను అందుకుంటున్నారని పేర్కొన్నారు, రానున్న కాలంలో మరింత హరి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తూ అందరికీ అందుబాటులో ఉండే సుపరిపాలనను సాగిస్తాం అని దిమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి , పార్టీ పరిశీలకులు వహీద్ హుస్సేన్, మాజీ మహిళా కమిషన్ సభ్యులు పర్వీన్ భాను, రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలు,, యూనిటీ ఇన్చార్జులు టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించారు.

# బెదిరింపులతో పోరాటాలను ఆపలేరు

- మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



మదనపల్లె- **సూర్య వాస్తవం, జూలై 2 :** బెదిరింపులతో ప్రజా ఉద్యమాలను అనచలేరని మున్సిపల్ అధికారులు గ్రహించాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత ముప్పై రోజులుగా ఆందోళనకు సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద సంగీభావం తెలిపిన శ్రీనివాసులు మాట్లాడుతూ ముప్పై రోజులుగా కార్మికులు సమ్మె చేస్తా ఉంటే వారి సమస్యలు చర్చించి ఉమ్మడి అవగాహనకు వచ్చి సమ్మె పరిష్కరించాల్సిన అధికారులు పాలకవర్గం అధికార పార్టీ నేతలు ఆ పని చేయకుండా బెదిరింపు ద్వారంలతో సమ్మె విరమిం చేసే కుటిల ప్రయత్నం చేయడం దుర్మార్గం అని అన్నారు 1000 రూపాయలు ఇచ్చి ఇతర కార్మికులని రోజువారీ పని కోసం కుదుర్చుకోవాలని ప్రయత్నాల కంటే ఇంజనీరింగ్ కార్మికులకు రోజుకు 800 చెల్లించిన సరిపోతుందని అంతకంటే ఎక్కువ కోరడం లేదని అన్నారు. కేవలం పోరాటం చేస్తున్న కార్మికుల పట్ల కక్ష సాధింపు దూరంలో భాగమే ఈ బెదిరింపులకు పాల్పడు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు చిత్తశుద్ధి కార్మికులు కోరుతున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీవో నెంబర్ 36 మేరకు వేతనాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు కూడా కావడం లేదని తెలిపారు. ఆర్థిక శాఖ లో పెండింగ్ వున్నా జివోలను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని చెప్పారు. కొత్తగా తీసుకున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ లోకి తీసుకోవాలని, ఆప్కాస్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చెయాలని పేర్కొన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 75000, ఎక్స్ గ్రేషియో రూ. 7 లక్షలు, దహన సంస్కారాలకురూ 20000 అడుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ప్రజలను కూడగట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నారాయణ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు , భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలి అని కోరుతున్న కార్మికుల సమస్యలు న్యాయ సమ్మతమైనవని పాలకవర్గం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు రామకృష్ణ, రాజన్న, శ్రీరాములు, కృష్ణప్ప, శంకర్మ, తులసమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటాం

## - డివిజనల్ ఛైర్మన్ ఇ. కిరణ్మయి




**పెళ్లకూరు-సూర్యా వాస్తవం, జూలై 2:** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని భయపడకుండా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం, రెవెన్యూ వ్యవస్థ సిద్ధంగా ఉందని సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు డివిజన్ లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ శ్రీమతి ఇ. కిరణ్మయి స్పష్టం చేశారు. గూడూరులో జరిగిన డివిజన్ స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ “కుల వివక్షత, అంటరానితనం, బానిసత్వ పరిస్థితులు, రెవెన్యూ సమస్యలు, ఇతర సామాజిక బాధలు ఏవైనా ఎదురైతే, బాధితులు నేరుగా అధికారులను సంప్రదించాలి. ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు చేపడతాం. గత సమావేశంలో వచ్చిన అనేక అంశాలకు పరిష్కారాలు సాధించాం. ఇదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాం,” అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు అరవపార్వతయ్య, డీఎస్పీ చెంచుబాబు, 9 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి కమిటీ సభ్యులు నల్లజామ్ రాము, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అధికారులు అన్ని మండలాలలో విజిలెన్స్ మెకానిజాన్ని మరింత బలోపేతం చేయాలని, బాధితులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఛైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ మండలాల్లో ఎదురయ్యే ప్రత్యేక సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వాటిని పరిశీలించి, సంబంధిత శాఖలతో చర్చించి త్వరిత పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

## భిన్నాభిప్రాయాలు

# పక్కన పెట్టి ఏకాభిప్రాయంతో పనిచేద్దాం

- సంస్థాగత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం
- తంబళ్లపల్లి మండల టిడిపి అబ్జర్వర్ ఆర్.జె.వెంకటేష్



మదనపల్లె- **సూర్య వాస్తవం, జూలై 2 :** భిన్నాభిప్రాయాలు పక్కనపెట్టి సంస్థాగత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని తంబళ్లపల్లి మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు,టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం తంబళ్లపల్లిలోని మండల పార్టీ కార్యా లయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్.జే.వెంకటేష్ మాట్లాడుతూ తాను మదనపల్లి నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ తంబళ్లపల్లి నియోజకవర్గం పై మంచి అవగాహన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఆవుల మోహన్ రెడ్డి మాకు రాజకీయ గురువు అని ఆయన తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా అద్భుతంగా పనిచేశారన్నారు. అంతేకాకుండా బీటీ కళాశాలలో తాను విద్యార్థి సంఘం నాయకుడిగా,సింగిల్ విండో ప్రెసిడెంట్,ఇతర పదవుల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. సమావేశం ఏర్పాటు చేసే తేదీని ముందుగానే తంబళ్లపల్లి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రా రెడ్డి,స్థానిక నాయకులకు సమాచారం అందించామన్నారు. నియోజకవర్గంలో వర్గ విభేదాలు ఎక్కువగా ఉన్నాయని, ఇవి అధిష్టానం దృష్టికి వెళ్లడం జరిగిందన్నారు. అయితే గ్రామ,మండల కమిటీలలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే అవకాశం కల్పిస్తామని,ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు.

ఇటీవల పీలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల, గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. దీంతో తనను తంబళ్లపల్లి మండల పరిశీలకులుగా అధిష్టానం నియ మించిందన్నారు. 2024 ఎన్నికల్లో దేశచరిత్ర ఎన్నడూ లేని విధంగా ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలలో 164 మంది కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. ఇటువంటి సునామీలో తంబళ్లపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో పార్టీ అధి కారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో మన పార్టీకి చెందిన ఎమ్మెల్యే లేకపోవడంతో పనులు సజావుగా సాగవన్నారు. చెట్టు బాగుంటే అది పదిమందికి మంచి నీడనిస్తుందని,ఏవైనా విభేదాలు ఉంటే టీ కప్పులో తుఫానులాగా ఉండాలే తప్ప వాటిని బహిర్గతం చేసుకో రాదన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అందరి అభిప్రాయం మేరకే కమిటీల నియామకం ఉంటుందని స్పష్టం చేశారు. కావున మండలం లోని టిడిపి నాయకులంతా సమిష్టిగా పనిచేసి సంస్థాగత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటుదామని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సుపరిపాలన, తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోస్థానిక టిడిపి నాయకులు రెడ్డెప్ప రెడ్డి,మహబూబ్ బాషా,రేపన బాబు,భాస్కర్ నాయుడు, జి.శ్రీనివాసులు,శ్రీనివాసులు రెడ్డి,ఎల్లప్ప, జయచంద్ర నాయుడు, వినోద్ కుమార్ రెడ్డి, తేజమూర్తి నాయుడులు పాల్గొన్నారు.



# పసి పిల్లల పోషణ కోసం పోషణ్ ట్రాకర్

## - సేవలకోసం ముఖ ఆధారిత నమోదు
## - అంగన్వాడీ సేవలకు కొత్త నిబంధన



**పెళ్లకూరు-సూర్యా వాస్తవం, జూలై 02:** పిల్లల ఆరోగ్యం, పోషణను మెరుగుపరచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన “పోషణ్ ట్రాకర్” యాప్ అమలులో భాగంగా, తిరుపతిజిల్లా పెళ్లకూరు మండలంలోని అంగ న్వాడీ కేంద్రాలలో సేవలు పొందే లబ్ధి దారులకు ముఖ ఆధారిత నమోదు (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) తప్పనిసరిగా అమలులోకి వచ్చిందని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. నాయుడుపేట ప్రాజెక్టు పరిధిలోని నాయు డుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో కలిపి మొత్తం 216 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో నూతన విధానం ప్రకారం, ప్రతి లబ్ధిదారుడు తన ఆధార్ కార్డు ద్వారా ముఖ గుర్తింపు ద్వారా నమోదు కావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో లబ్ధిదారుడి మొబైల్ నంబర్‌కు ఓటిపి వస్తుంది. దానిని ఉపయోగించి, వారి ఫోటో లేదా వీడియోను “పోషణ్ ట్రాకర్” యాప్‌లో అప్లోడ్ చేయాలి. ఇక రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “బాల సంజీవిని” యాప్ లోనూ ఇదే విధంగా ముఖ ఆధారిత నమోదు చేయవలసి ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఈ రెండు యాప్‌లలో గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసిన వారికే అంగన్వాడీ కేంద్రాల నుండి ఆహార సరఫరా, పోషకాహారం, ఇతర పథకాల ప్రయోజనాలు అంద నున్నాయని వివరించారు. ఈ సందర్భంలో ఐసిడిఎస్ సిడీపీఓ కే. ఉమామహేశ్వరి మాట్లాడుతూ “అంగన్వాడీ సేవలు నిర్బంధంగా అందించాలంటే ప్రతి లబ్ధిదారుడు తన ఆధార్ కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకుని, గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే సేవలు నిలిపివేయాల్సి వస్తుంది,” అని తెలిపారు. అటువంటి సందర్భంలో లబ్ధిదారులు తమ వివరాలు వెంటనే సమర్పించి అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై ఏకపక్ష నిర్ణయం తగదు


- అందుకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటిస్తామని వెల్లడి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలలు అసోసియేషన్ కోశాధికారి ఎం.కృష్ణ



**కుప్పం- సూర్యవాస్తవం, జూలై 2 :** రాష్ట్రంలోని ప్రైవేట్ అనేటేడ్ పాఠశాలలు తరపున ప్రైవేటు పాఠశాలలో గుర్తింపు పునరుద్ధరణకు ఎనిమిది సంవత్సరాల నుండి పది సంవత్సరాలు పొడిగించినందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలలు అసోసియేషన్ కోశాధికారి ఎం.కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రతిభ వార్డులలో తమ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా చోటు కల్పించినందుకు, తల్లికి వందనం పథకం ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు వర్తింప జేసినందుకు ఆయన అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే కొంతమంది అధికారులు ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలపై అతిగా స్పందించడం మరియు పాఠశాలలపై ప్రియమైన కమిటీలు తనిఖీలను అమలు చేయడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. కొన్ని ఏకపక్ష వార్తలు లేదా కొంతమంది వ్యక్తుల లేఖల ద్వారా తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా ఎప్పటికప్పుడు తమకు నోటీసులు జారి చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే వాటి నమోదు చేయమనడం కొంతమంది క్షేత్రస్థాయి అధికారుల నుండి అగౌరవమైన సందేశాలు మరియు హెచ్చరికలతో ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తీవ్ర ఆవేదనకు గురవుతున్నట్టు తెలిపారు దీంతో తమ రోజువారి పరిపాలనకు అంతరాయం కలుగుతుందని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇలాంటి చర్యలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను పాఠశాలల సిబ్బందిని ఆవేదనకు గురిచేస్తుందని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు తీసుకున్న అనాలోచిత ఏకపక్షం నిర్ణయాల వల్ల ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలను ఆర్టిఇ 12.1.సి దరఖాస్తుదారులను తగిన ధ్రువీకరణ లేకుండా చేర్చుకోవాలని బలవంతం చేయడం తగదన్నారు పాఠశాలలను షోకేస్ నోటీసులతో వేధించడం గుర్తింపును రద్దు చేస్తామని బెదిరించడం వంటి చర్యలకు ప్రతిస్పందనగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్ని పాఠశాలలు గురువారం మూసివేయబడుతుందని ఆయన ఆ పట్టణంలో తెలిపారు. ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు తమ హక్కులను కాపాడేందుకు తాము ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. నియమ నిబంధనలను సరిగ్గా పరిశీలించకుండా ఎటువంటి నోటీసులు మరియు చర్లకు ఉపక్రమించకుండా అధికారులను కట్టడి చేయాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే రాష్ట్రంపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఆంధ్రప్రదేశ్ లో 55 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రైవేటు పాఠశాలలో దాదాపు 85% పాఠశాలలు ప్రభుత్వం చేసే ఖర్చులో మూడో వంతు కన్నా తక్కువ ఫీజులకే నాణ్యమైన విద్యను తమ అందిస్తు న్నట్లు తెలిపారు ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ఏదైనా అంతరాయం పెడితే అది పదివేల మంది యాజమాన్యాలను ప్రభావితం చేయడమే కాకుండా దాదాపు మూడు లక్షల మంది సిబ్బందిని మరియు 40 లక్షల మంది విద్యార్థులను కూడా ప్రభావితం చేస్తుందని తెలిపారు ఇటువంటి అనాలోచితం నిర్ణయాలను ఏకపక్ష చర్యలను ఖండిస్తూ ప్రైవేటు పాఠశాలలపై ఇలాంటి దాడులను ఆపాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వరి ధాన్యం డబ్బును సత్వరమే చెల్లించండి

- డిఆర్ఓకి
ఏపి రైతు సంఘం వినతి



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** తమ వరిధాన్యం డబ్బును తమ ఖాతాలో ఎప్పుడు జమ చేస్తారంటూ బొమ్మనహాళ్ రైతులు డిఆర్ఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ కొద్దిరోజుల్లో మొదలవుతుంది రైతుల వరి ధాన్యం డబ్బును ఖాతాలో జమచేసి వారి సమస్యను తీర్చండి. అంటున్న ఏపీ రైతు సంఘం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఏపీ రైతు సంఘం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ బొమ్మనహాల్. కనేకల్ మండలాల్లో ప్రభుత్వం వరి కొనుగోలు చేసింది కొనుగోలు చేసి దాదాపు రెండు నెలలు అవుతుంది. ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు ఇంతవరకు రైతులు ఖాతాలో జమ చేయలేదు. రెండు నెలలు కావస్తున్న ఖాతాలో నగదు జమ కాకపో వడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు బొమ్మనహాల్ మండలంలో శ్రీధర గట్ట గ్రామంలో 53 టన్నులు కొనుగోలు చేశారు దాదాపు 45 మంది రైతులు అదేవిధంగా ఉద్దేహాల్ 765 టన్నులు కొనుగోలు చేశారు రైతుల 75 మంది మొత్తం బొమ్మనహాల్ 1268 టన్నులు కొనుగోలు చేశారు దాదాపు 120 మంది రైతులు అదేవిధంగా కనేకల్ మండలంలో 280మంది రైతులు 64,227బ్యాగులుప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు6,96,02,656 ఇలా కోట్ల రూపాయలు రావాల్సి ఉంది కావున రైతులు ప్రభుత్వం కి వరి ధాన్యం అమ్మిన సొమ్మును వెంటనే వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేయాలి ప్రస్తుత పరిస్థితుల్లో రైతు కుటుంబాలు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి అప్పులు తెచ్చి పంట పొలాలకు పెట్టుబడులు పెట్టుకున్న రైతులు అప్పులు తీసుకున్న చోట సమాధానాలు చెప్పుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు రెండు నెలల నుండి కార్యాలయాల చుట్టూ సొసైటీలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతునే ఉన్నారు అయిన ప్రభుత్వంలో చలనం లేదు ఒకపక్క రబీ సీజన్ అయిపోయింది ఖరీఫ్ సేద్యంపనులు చేపడుతున్నారు విత్తనాలకు ఎరువులకు ఇతర పనులకు డబ్బులతో కూడుకున్న సమస్యలు కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలి. రైతులకు రావలసిన సొమ్ము ఆన్లైన్లో చెక్ చేసుకుంటే అప్రూడు యువర్ బ్యాంక్ అని చూపిస్తుంది కానీ ఇంతవరకు అమ్మిన డబ్బులు మాత్రం రైతుల ఖాతాలో జమ కాలేదు వస్తాయని.ఎదురుచూస్తున్నానే ఉన్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలనీ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి అనంతపురం జిల్లా విఆర్ఓ గారికి సమ స్యలతో కూడిన ఇంటి పత్రం అందజేశారు తక్షణమే రైతుల సమస్యలను తీర్చాలని వారిని కోరారు. రైతుల సమస్యలు సత్వరమే తీర్చకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని ఉన్నతగా అధికారులకు తెలియజేశారు. త్వరితగతిన రైతుల ఖాతాలో సొమ్ము జమ కాకపోతే దశలవారీగా ఉద్యమాలు చేయడానికి ఏపీ రైతు సంఘం పిలుపునిస్తుందని. తక్షణమే అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని వెంటనే రైతుల ఖాతాలో సొమ్మును జమచేసేలాగ చూడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా సహాయక కార్యదర్శి దేవ ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి బొమ్మనహాల్ మండలం రైతులు తిమ్మప్ప. రామాంజనేయులు పెద్దిరెడ్డి. ఆనందు. ఉపేంద్ర బసవరాజు. సుధాకర్ వన్నూరుస్వామి తిమ్మప్ప.లింగారెడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన
- క్షయపై ఆందోళన వద్దు.. అవగాహన ముఖ్యమన్న ఎమ్మెల్యే




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 2:** జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. టిబి ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా తన క్యాంప్ కార్యాలయంలో క్షయవ్యాధి నివారణ,చికిత్సవిధానం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా క్షయ నివారణా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన ప్రజలు, సంద ర్శకులు, అధికారులు, టీడీపీ నేతలతో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధిని నిర్మూలించాలంటే ముందుగా వ్యాధిగ్రస్థులను గుర్తించి సరైన వైద్యం చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి వెంటనే వైద్యం అందేలా చూడాలన్నారు. క్షయ వచ్చిందంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వెంటనే వైద్య చికిత్సలు తీసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్థులకు ప్రతీ నెల కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి సాయం చేస్తోందని.. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార కిట్స్ పంపిణి చేసేందుకు నా వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ గంగారాం, రాష్ట్ర వాల్మీకి పెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, నాయి బ్రాహ్మణ పెడరేషన్ డైరెక్టర్ కొండన్న, క్షయ వ్యాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# సర్వజన ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం...

- పక్షవాతం రోగికి రోజంతా ఒక్కటే సెలైన్‌తో ట్రీట్మెంట్
- స్ట్రక్చర్ కావాలని ప్రాధేయపడినా కనుకరించని వైనం
- ఎవరికైనా చెప్పుకో......!
- రోగి కూతురు పట్ల సర్వజన ఆస్పత్రి వైద్య సిబ్బంది తీరు ...- పట్టించుకోని అధికారులు




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘోర వైద్య నిర్లక్ష్య ఘటన తీవ్రంగా ప్రశ్నార్థకంగా నిలిచింది. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. వివిధ వ్యాధులతో వచ్చే రోగులు, వారి బంధువులు మాట్లాడుకోవడం విశేషం. సరైన అధికారి లేకపోవడం, వైద్య సిబ్బందిని నియంత్రించక పోవడంతో నిర్లక్ష్యం రాజ్యమేలుతుందని విమర్శిస్తున్నారు.యథా రాజా తథా ప్రజా అన్న చందంగా దిగువ స్థాయి సిబ్బందికి భయం లేకుండా పోయిందని అంటున్నారు. ఆసుపత్రిలో జరిగిన నిర్లక్ష ఘటనే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. అసలు వివరాల్లోకి వెళితే..... అనంతపురం పట్టణానికి చెందిన ఒక యూట్యూబర్ తన తల్లి కి పక్షవాతం రావడంతో సర్వజన ఆస్పత్రిలో చికిత్స కొరకు చేర్పించింది అయితే తన తల్లికి చికిత్స అందించకుండా రోజంతా ఒక్క సెలైన్ బాటిల్ తో కాలయాపన చేశారని తద్వారా తన తల్లికి ఆరోగ్యం బాగా క్షీణించడంతో బెంగళూరుకు తీసుకువెళ్లి చికిత్స చేయించాలని నిర్ణయించుకుంది. అయితే తన తల్లికి అంబులెన్స్ లో తీసుకువెళ్లడానికి ఏ సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం ఆమె ఎంత బ్రతిమిలాడుకున్నా ఒక్కరు కూడా స్పందించకపోవడం విడ్డూరం. కనీసం తన తల్లినీ తానే స్ట్రక్చర్ పై తీసుకెళ్తానని స్ట్రక్చర్ కొరకు ప్రాధేయపడిన పట్టించుకోకపోగా ... ఎవరికైనా చెప్పుకో పో....అని వైద్య సిబ్బంది వ్యవహరించారనీ ఆమె వాపోయింది.

**ఫిర్యాదులు చేసిన పట్టించుకోని ఉన్నతాధికారులు**

వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంలేదని పలు ఫిర్యాదులున్నా ఉన్నత వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. హాజరుశాతం మెరుగుపరిచేందుకు రిజిస్టర్ తొలగించి బయోమెట్రిక్ ఏర్పాటు చేసిన లాభం లేదంటున్నారు వైద్యసిబ్బంది. పలువురు బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. వైద్యులెవరూ విధులకు హాజరు కావడంలేదని రోగి తాలూక బంధువులు ఆరోపిస్తున్నారు.ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా అనంతపురం సర్వజన ఆసుపత్రి ని పట్టించుకోవాలని అనంత జిల్లా వాసులు వేడుకుంటున్నారు.

# కాలువ కాదు.... పాఠశాల..!

- డ్రైనేజీ వాటర్‌తో నిండిన
ప్రభుత్వ పాఠశాల ఆవరణం....



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 2:** పత్తికొండ మండలం హొసూర్ గ్రామంలోని ఎస్. డబ్ల్యు ప్రభుత్వ పాఠశాలలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా పేరుకుపోయింది.స్కూల్ ఆవరణలో మురుగు నీరు,వ్యర్థ జలాలు చేరి అందులోనుంచి వచ్చే చెడు వాసనకు దోమలకు పాఠశాలలోని పిల్లలు అస్వస్థతకు గురై డెంగీ, మలేరియా జ్వరాలతో వచ్చే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా పాఠశాల ఆవరణలో పెరుకపోయిన పిచ్చి చెట్లు, గడ్డి వల్ల విష పురుగులు పాములు దర్శనమీవ్వడంతో పిల్లలు భయాందోళనకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర చెత్తో నిండి ఉన్న పట్టించుకునే నాథుడే లేడంటూ గ్రామస్థులు వాపోతున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )